క్లుప్తంగా

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ


కొలువుదీరిన విగ్రహాలు

గుడిపాల: మండలంలోని చెరువుముందరవూరులో శ్రీవేణుగోపాలస్వామి, గణపతి, సుబ్రమణ్యస్వామి ఆలయ మహా కుంభాభిషేకంలో భాగంగా 2వ రోజు మంగళవారం విగ్రహ ప్రతిష్ఠాపనా పూజలు వైభవంగా జరిగాయి. గణపతి పూజ, వేదపారాయణం, కలశ స్థాపన, కలశపూజ, ప్రథమకాల హోమం, తిరుమం జనం, గ్రామోత్సవం, లఘు పూర్ణాహుతిని వేదపండితుల శాస్త్రోక్తంగా నిర్వహించారు. మధ్యాహ్నం 2గంటలకు అన్నమాచార్య ప్రాజెక్ట్ వారిచే హరికథ కాలక్షేపం నిర్వహించారు. సాయంత్రం 6గంటలకు ద్వితీయ కాలపూజ, నవగ్రహపూజ, ద్వితీయ కాలహోమం, శిఖర కలశ ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ, అష్టబంధనం, లఘుపూర్ణాహుతి నిర్వహించారు. అన్నదానం చేశారు.


హోమ పూజలు

టిడ్కో గృహాలు కేటాయించండి

చిత్తూరు కార్పొరేషన్: టిడ్కో గృహాలను డిపాజిట్ చెల్లించిన వారికి ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజన్ కోరారు. మార్చి 2న విజయవాడలో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ నగరంలో గోడపత్రికలను విడుదల చేశారు. గ్రామీణ ప్రాంతంలో కనీసం ఇంటికి రెండు సెంట్లు, పట్టణ ప్రాంతంలో ఒకటిన్నర సెంటు ఇవ్వాలని కోరారు. ఇళ్ల నిర్మాణాలకు అందించే సాయాన్ని పెంచాలన్నారు. నాయకులు గోపీనాథ్, చంద్ర, విజయగౌరి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతగా మధ్యాహ్నం భోజనం


పదార్థాలను పరిశీలిస్తున్న ఎంఈఓ

గుడిపాల: మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని మండల విద్యాశాఖాధికారి రామ్‌నాయక్ అన్నారు. మంగళవారం కమ్మతిమ్మాపల్లె జెడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకం అమలును ఆయన తనిఖీ చేశారు. వంట గదిని పరిశీలించారు. విద్యార్థులతో భోజనం నాణ్యతగా ఉందా అని అడిగారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాణ్యతగా, మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని హెచ్‌ఎం భానుప్రకాష్‌కు సూచించారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో ఇంటి వద్దకే వైద్యం


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

ఐరాల: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో 104 వైద్య బృందం గ్రామీణుల ఇంటి వద్దే వైద్య పరీక్షలు చేయడంతో పాటు మెరుగైన చికిత్స అందిస్తున్నట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం కొనగుంటలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 80 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, చిన్న పిల్లలకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మంచానికే పరిమితమైన రోగుల ఇంటి వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సలహాలు ఇచ్చారు.

జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి


జ్వరాలపై ఆరా తీస్తున్న వైద్య సిబ్బంది

యాదమరి: జ్వరాలపై గ్రామీణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని యాదమరి వైద్యాధికారి అనిల్‌కుమార్ సూచించారు. బుడితరెడ్డిపల్లెలో డెంగీ పాజిటివ్ రావడంతో వైద్య బృందం మంగళవారం గ్రామంలో వైద్య పరీక్షలు నిర్వహించింది. ప్రతి ఇంటికీ వెళ్లి జ్వరాలు ఉన్నాయా అని ఆరా తీశారు. మందులు అందించారు. పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించి అవగాహన కల్పించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. జ్వరాలు వచ్చిన వెంటనే పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు చేసుకుని చికిత్సలు పొందాలని తెలిపారు. సీహెచ్‌ఓ లక్ష్మీనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

పూతలపట్టు: పేకాట స్థావరాలపై పోలీసులు మంగళవారం సాయంత్రం విస్తృత దాడులు నిర్వహించారు. మండలంలోని గువ్వలకాలనీలో ఆరుగురు జూదరులు పట్టుబడ్డారు. వారి నుంచి రూ.13 వేలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

సీవీ రామన్ స్ఫూర్తిని అందిపుచ్చుకోవాలి


చిత్తూరు: కణ్ణన్ ప్రభుత్వ పాఠశాలలో సీవీ రామన్‌కు నివాళి


చిత్తూరు : శ్రీచైతన్య పాఠశాలలో బహుమతుల ప్రదానం


గుడిపాల: సీఎస్‌ఆర్ పాఠశాలలో సైన్స్ మేళాను పరిశీలిస్తున్న తహసీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్



గుడిపాల: పానాటూరులో బహుమతుల ప్రదానం

చిత్తూరు కలెక్టరేట్ : విద్యార్థులు సీవీరామన్ స్ఫూర్తిని అందిపుచ్చుకోవాలని ఎంఈఓ సెల్వరాజ్ అన్నారు. నగరంలోని పలు పాఠశాలల్లో మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కణ్ణన్ ప్రభుత్వ పాఠశాలలో హెచ్‌ఎం తులసి బాబు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఎంఈవో సెల్వరాజ్, 26వ వార్డు కార్పొరేటర్ చెల్లముత్తు అతిథులుగా పాల్గొని సైన్స్ ప్రాముఖ్యతను వివరించారు. క్లస్టర్ పరిధిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలు పాఠశాలల విద్యార్థులు సైన్స్ ప్రయోగాలను ప్రదర్శించారు. ఉత్తమ నమూనాలను ప్రదర్శించిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. నగరంలోని న్యూయార్క్, లిటిల్ ఫ్లవర్, విజయం, శ్రీచైతన్య పాఠశాలల్లో సైన్స్ దినోత్సవం నిర్వహించారు. ఆయా పాఠశాలల నిర్వాహకులు శ్రీధర్, తేజోమూర్తి, గోపాలకృష్ణమూర్తి, ఏజీఎం సురేష్, ఆర్‌ఐ చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.

గుడిపాల: విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని వెలికితీసేందుకు సైన్స్‌మేళాలు ఉపకరిస్తాయని మండల


మేళాను పరిశీలిస్తున్న చిత్తపార హెచ్‌ఎం

విద్యాశాఖాధికారి రామ్‌నాయక్, తహసీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్ అన్నారు. సీవీ రామన్ జయంతిని పురస్కరించుకుని మండలంలోని నరహరిపేట, చిత్తపార హైస్కూల్‌తో పాటు సీఎస్‌ఆర్ పాఠశాలలో శుక్రవారం సైన్స్‌మేళాను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో విజ్ఞానాన్ని పెంపొందించాలంటే విద్యార్థి దశ నుంచే సైన్స్‌పై మక్కువ పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఆమేరకు విద్యార్థులను ఉపాధ్యాయులు చైతన్య పరచాలని తెలిపారు. మండలంలోని శ్రీరంగంపల్లె, కమ్మతిమ్మాపల్లె, బొమ్మసముద్రం, పానాటూరు సీఆర్‌సీ పరిధిలోని పాఠశాలల విద్యార్థులు తాము రూపొందించిన సైన్స్ ఎగ్జిబిట్లను మేళాలో ప్రదర్శించారు. ఉత్తమ ప్రదర్శనలను ఎంపిక చేసి బహుమతులను అందజేశారు. హెచ్‌ఎంలు సబర్‌మతి, రెడ్డిశేఖర్, మనోహర్, సర్పంచ్ మధుసుదన్ రెడ్డి, రజనీకాంత్, కరస్పాండెంట్ లోకేష్, సీఆర్‌పీలు మల్లికార్జున్, వెంకటేష్, వాణి పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

ఐరాల: సీవీ రామన్ జయంతి సందర్భంగా మంగళవారం స్థానిక ఉన్నత పాఠశాల, పుత్రమద్ది జెడ్పీ హైస్కూల్‌లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత సీవీ రామన్ చిత్రపటానికి నివాళులర్పించారు. స్థానిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులను ఎంఈఓ వేణుగోపాల్‌రెడ్డి తిలకించి విద్యార్థులను అభినందించారు. ఇన్‌చార్జ్ హెచ్‌ఎం విజయలక్ష్మి, పుత్రమద్ది హెచ్‌ఎం గోపినాథ్, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం మోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బంగారుపాళెంలో..

బంగారుపాళెం: బంగారుపాళెం, తుంబకుప్పం, మొగిలి మిట్టూరు, ఎగువరాగిమానుపెంట, మంగళపల్లె, పీడీవీ కండ్రిగ, గుండ్లకట్టమంచి, బోడబండ్ల, టేకుమంద, తుంబపాళెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో సైన్‌మేళా నిర్వహించారు. సీవీ రామన్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. బంగారుపాళెం సైన్స్ మేళాలో విద్యార్థుల ప్రదర్శనలను ఎంఈఓ నాగేశ్వర్‌రావు పరిశీలించారు. క్లస్టర్ ప్రధానోపాధ్యాయుడు రాజేంద్రన్ మాట్లాడారు. మంగళపల్లె జెడ్పీ హైస్కూల్ కార్యక్రమంలో యువ శాస్త్రవేత జ్యోతికుమార్ పాల్గొని విద్యార్థులకు ప్రయోగాలపై అవగాహన కల్పించారు. జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు అరుణ్‌శివప్రసాద్ మూఢనమ్మకాలను వీడాలని సూచించారు. ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

శాస్త్రీయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

తవణంపల్లె: విద్యార్థులు శాస్త్రీయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని తవణంపల్లె ఎంఈఓ శంకరయ్య ఆకాంక్షించారు. మండలంలోని ఏడు సీఆర్‌సీ సెంటర్లలో విద్యార్థులు సైన్స్ ప్రయోగాలను ప్రదర్శించారు. ఎంఈఓ ప్రయోగాలను పరిశీలించారు. ఉత్తమ ప్రదర్శనలను ఎంపిక చేసి బహుమతులను అందజేశారు. తవణంపల్లె హైస్కూల్లో ఎంఈఓ శంకరయ్య, ఉపాధ్యాయులు హెచ్‌ఎం శ్రీరంజని, ఉపాధ్యాయుల బృందం డాక్టర్ సీవీరామన్ చిత్ర పటానికి నివాళులర్పించారు.

ప్రతి విద్యార్థి శాస్త్రవేత్త కావాలి

యాదమరి: ప్రతి విద్యార్థి శాస్త్రవేత్త కావాలని ఎంపీఈఓ రుక్మిణి సూచించారు. కాశిరాళ్ల ఉన్నత పాఠశాలలో సైన్స్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు నమూనా ప్రయోగాలను ప్రదర్శించారు. ప్రయగాలను ఎంఈఓ రుక్మిణీ పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుతో పాటు సైన్స్‌పై మక్కువ పెంచుకోవాలని తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. హెచ్‌ఎం రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


తవణంపల్లె హైస్కూల్లో సీవీ రామన్‌కు నివాళి


యాదమరి : నమూనాలను పరిశీలిస్తున్నహెచ్‌ఎం, ఉపాధ్యాయులు


ఐరాల : నమూనాలను పరిశీలిస్తున్న ఎంఈఓ


బంగారుపాళెం : నమూనాలను తిలకిస్తున్న ఎంఈఓ

ఏఈ నిర్లక్ష్యంతోనే రోడ్డు పనుల స్తంభన

- ఆయన సమావేశాలకు రావాలి
  - సభ్యులు డిమాండ్
- రహదారికి మరమ్మతులు చేయిస్తాం
  -జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి

యాదమరి: ఆర్ అండ్‌బీ ఏఈ నిర్లక్ష్యం కారణంగానే మండల పరిధిలో రహదారులు, చిత్తూరు–గుడియాత్తం అంతర్ రాష్ట్ర రహదారి మరమ్మతులకు నోచుకోవడం లేదని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ సురేష్‌బాబు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయరెడ్డి విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ నేపథ్యంలో నిబంధనల మేరకు సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. పలువురు సభ్యులు మాట్లాడుతూ బుడితరెడ్డి పల్లె, మాదిరెడ్డిపల్లె, కొటాల గ్రామాలకు వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారులు, చిత్తూరు–గుడియాత్తం అంతర్ రాష్ట్ర రహదారి గుంతల మయంగా ఉందని, అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. ఏఈ మండలానికి రావడం లేదని, సర్వ సభ్య సమావేశాలకు హాజరుకావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెల్లరాళ్లపల్లె సర్పంచ్ భజలింగం మాట్లాడుతు చిత్తూరు నుంచి జోడి చింతల వరకు 14 కిలోమీటర్ల రహదారి వెడల్పు, తారు వేయడానికి రూ.16 కోట్లు మంజూరు అయ్యిందన్నారు. అక్కడ నుంచి 10 కిలోమీటర్లు రహదారి వేయడానికి ఆర్‌అండ్‌బీ అధికారులు కేవలం రూ.3 నుంచి రూ.4 కోట్లు అంచనా వేయడం చూస్తుంటే రహదారికి బాగు పడకూడదనే ఆలోచన వారికి ఉన్నట్లు ఉందని ఆరోపించారు. జెడ్పీ వైస్ చైర్మన్ మాట్లాడుతు రెండు రోజుల్లో విజయవాడలో ఆర్‌అండ్‌బీ మంత్రిని కలిసి రహదారి సమస్యలు వివరించి నిధులు మంజూరు చేసి రహదారులు బాగు చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో సభ్యులు శాంతించారు.

త్వరలో పట్టాలు

తహసీల్దార్ చిట్టిబాబు మాట్లాడుతూ మండల పరిధిలో ఆరు రెవెన్యూ గ్రామాల్లో భూ శాశ్వత హక్కు పథకం కింద రీ సర్వే చేస్తున్నామని, త్వరలో పట్టాలు అందిస్తామన్నారు. పశు వైద్యాధికారి అమరనాథరెడ్డి మాట్లాడుతు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ వ్యాక్సిన్‌లు వేయనున్నట్లు తెలిపారు. ఉపాధి ఏపీఓ కవిత మాట్లాడుతు జాబ్ కార్డులు ఉన్న లబ్ధిదారులు బ్యాంక్ ఖాతాకు ఆధార్ అనుసంధానం చేసుకుంటే బిల్లులు జమ అవుతాయని వివరించారు. ట్రాన్స్‌కో ఏఈ గురప్ప మాట్లాడుతూ వేసవిలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు పెరియంబాడి పరిధిలో మరో సబ్ స్టేషన్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఎంపీడీఓ శివరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నవీన్, ఇతర అధికారులు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులు,సర్పంచ్‌లు పాల్గొన్నారు.

నేటి నుంచి గాలికుంటు నివారణ టీకాలు


సాయిసుధ

గుడిపాల: మండల వ్యాప్తంగా బుధవారం నుంచి పశువులకు గాలికుంటు వ్యాధి(ఫుట్ అంట్ మౌత్ డిసీసెస్–ఎఫ్ఎండీ) నివారణ టీకాలు వేయనున్నట్లు పశువైద్యాధికారి సాయిసుధ తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ నెలరోజుల పాటు నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో మండల వ్యాప్తంగా 17వేల ఆవులు, ఎద్దులకు టీకాలు వేయనున్నట్లు వెల్లడించారు. అంటువ్యాధి అయిన ఇది సోకితే పశువుల్లో మరణాలు తక్కువైనా బలహీనపడడం, పాల ఉత్పత్తి తగ్గిపోవడం జరుగుతుందని తెలిపారు. 104 నుంచి 106 డిగ్రీల జ్వరం, నోరు, నాలుక వద్ద పుండ్లు ఏర్పడి మేత మేయకపోవడం , చొంగకార్చడం, గిట్టల మధ్య పుండ్లు ఏర్పడడం లాంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. ఒక్కోసారి పొదుగువాపు వ్యాధి కూడా సోకుతుందని తెలిపారు. బ్యాక్టీరియా చేరి చీము కారడం వల్ల ఇతరత్రా రోగాలు వ్యాపించే అవకాశం ఉంటుందన్నారు. వ్యాధిసోకిన పశువుల గిట్టలు, పుండ్లను పొటాషియం పర్మాంగనేట్ ద్రావణంతో శుభ్రం చేయడం, బోరోగ్లిజరిన్ పూత రాయడం, ఈగలు వాలకుండా వేపనూనె, నిమ్మెంట్, లారాజెంట్ లాంటి మందులు వాడాల్సి ఉంటుందని తెలిపారు. వ్యాధి సోకిన పశువులకు రోజూ 50 గ్రాములు అయోడైజ్డ్ ఉప్పు దాణాతో కలిపి ఇస్తే కొంత ఉపశమనం ఉంటుందన్నారు. 30 గ్రాముల ఎముకల పొడిని పచ్చిమేతతో కలిపి రోజూ ఇస్తే త్వరగా కోలుకుంటాయన్నారు. వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స చేయించడం కన్నా రాకుండా ముందస్తుగా టీకాలు వేయించాలని సూచించారు.

ఐరాల: మండల వ్యాప్తంగా బుధవారం నుంచి పశువులకు గాలికుంటు వ్యాధి (ఫుట్ అండ్ మౌత్ డిసీస్–ఎఫ్ఎండీ) నివారణకు టీకాలు ఉచితంగా వేయనున్నట్లు పశుసంవర్థక శాఖ ఏడీ పద్మావతి తెలిపారు. మంగళవారం స్థానిక పశువైద్యశాలలో ఆమె మాట్లాడుతూ నెల రోజుల పాటు నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో మండల వ్యాప్తంగా 20 వేల ఆవులు, గేదెలు, ఎద్దులకు టీకాలు వేయనున్నట్లు పేర్కొన్నారు.

సస్యరక్షణపై అవగాహన ఉండాలి


పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి లక్ష్మీప్రసన్న

గుడిపాల: పంటల సస్యరక్షణపై రైతులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి లక్ష్మీప్రసన్న అన్నారు. మంగళవారం వసంతాపురం రైతుభరోసా కేంద్రంలో రైతులకు చీడపీడల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మిరపపంటలో ఆకుముడత, వంగ, టమాటాలో కాయతొలుచు పురుగు నివారణపై సమగ్ర సస్యరక్షణ చర్యలను వివరించారు. రబీలో వరికి బదులుగా ఆరుతడి పంటలను సాగు చేయాలని తెలిపారు. చిరుధాన్యాల సాగుతో పర్యావరణ పరిరక్షణ, సుస్థిర దిగుబడి పొందవచ్చన్నారు. అనంతరం క్షేత్ర స్థాయిలో వివిధ పంటలను పరిశీలించి రైతులకు చీడపీడల నివారణపై సూచనలు ఇచ్చారు. గుడిపాల వ్యవసాయాధికారి మాధవి, ఎంపీహెచ్‌ఓ సోనియా పాల్గొన్నారు.

పీహెచ్‌సీ అభివృద్ధికి కృషి


మాట్లాడుతున్న ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి

గుడిపాల: బొమ్మసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధికి కృషి చేస్తానని ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి అన్నారు. మంగళవారం పీహెచ్‌సీలో సర్పంచ్ ప్రసాద్ అధ్యక్షతన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఆస్పత్రిని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులను ఏయే వాటికి ఖర్చు పెట్టాలి అన్న వాటిపై చర్చించారు. ముఖ్యంగా రోగులకు కావాల్సిన వసతులను వెంటనే ఏర్పాటు చేయాలని కమిటీ నిర్ణయించింది. మరుగుదొడ్లు, ప్రహరీగోడ నిర్మాణాలపై చర్చించారు. రోగులకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఎంపీపీ ఆదేశించారు. వైద్యాధికారి రష్మిత, సీనియర్ అసిస్టెంట్ నియాజ్, సర్పంచ్ రజనీకాంత్, గుణవతి, శాంతకుమారి, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజారోహణం


స్వామి,అమ్మవార్ల ఊరేగింపు

పుంగనూరు: పట్టణంలోని కోనేటి వద్ద వెలసి ఉన్న శ్రీకళ్యాణ వెంకట్రమణస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం ధ్వజారోహణంతో వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి ఉత్సవ విగ్రహాలను సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. 11 రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాల కోసం ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. శ్రీదేవి,భూదేవి సమేతంగా స్వామివారు పురవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు.

పంతాలు వీడండి..చదువు చెప్పండి


సమావేశంలో మాట్లాడుతున్న డీవైఈఓ చంద్రశేఖర్

చిత్తూరు రూరల్: పరీక్షల సమయం దగ్గర పడింది.. పంతాలు వీడి.. పిల్లలకు చదువు చెప్పే పని చూడాలని ఉపాధ్యాయులకు డీవైఈఓ చంద్రశేఖర్ గట్టిగా వార్నింగ్ ఇచ్చారు. చిత్తూరు మండలం సిద్ధంపల్లె ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల వర్గ పోరుపై సోమవారం 'అయ్యోర్ల వర్గ పోరు' శీర్షికన 'సాక్షి' లో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. మంగళవారం పాఠశాలకు వెళ్లి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. తొలుత తల్లిదండ్రుల అభిప్రాయాన్ని సేకరించారు. ఆ తర్వాత ఉపాధ్యాయుల పనితీరుపై మండి పడ్డారు. పిల్లల చదువుపై దృష్టి పెట్టాలన్నారు. ఉపాధ్యాయిల సమస్యల వల్ల పిల్లల చదువుకు ఆటంకం కలుగకూడదని హెచ్చరించారు. తదుపరి చర్యలు తీవ్రంగా ఉంటాయన్నారు. పద్ధతి మార్చుకుని సమన్వయంతో పనిచేయాలన్నారు. ఎంఈఓ సెల్వరాజ్, సర్పంచులు, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి


మాట్లాడుతున్న పార్టీ నేత ప్రకాష్‌రెడ్డి

తవణంపల్లె: సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఆశయాలకనుగుణంగా 2024 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి ప్రతి ఒక్కరు కష్టపడి పని చేయాలని పార్టీ తవణంపల్లె మండల నాయకుడు, పారిశ్రామికవేత్త గురుకువారిపల్లె ప్రకాష్ రెడ్డి పిలుపు నిచ్చారు. మంగళవారం మండలంలోని గురుకువారిపల్లెలో పూతలపట్టు నియోజకవర్గంలోని పార్టీ సోషల్ మీడియా, ఐటి వింగ్, యూత్ విభాగం సభ్యులతో సమావేశం నిర్వహించారు.ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షాల అసత్య ఆరోపణలను తిప్పికొడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. మరోసారి సీఎంగా జగన్‌మోహన్ రెడ్డిని గెలిపించేలా విస్తృతంగా ప్రచారం చేపట్టాలని తెలిపారు. గత ప్రభుత్వంలో ప్రజలు నష్టపోయిన విషయాలను, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జరిగిన మేలును వివరించాలని సూచించారు. ఈ సందర్భంగా పార్టీ కోసం శ్రమిస్తున్న సోషల్‌మీడియా, ఐటి వింగ్‌కు రూ.50 వేలు అందించి ప్రోత్సహించారు. పార్టీ మండల కన్వీనర్ సిద్దంపల్లె హరిరెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సురేష్‌బాబురెడ్డి, సర్పంచ్ భాను, నాయకులు నరోత్తమరెడ్డి, గురునాథరెడ్డి, ఈశ్వర్ రెడ్డి, ప్రకాష్‌బాబు రెడ్డి, మధుకుమార్, చంద్రారెడ్డి, వెంకటరమణ పాల్గొన్నారు.

భక్తాంజనేయస్వామికి విశేష పూజలు



గంగాధరనెల్లూరు: వేపంజేరిలోని దశావతార పుష్కరిణి ఆవరణలో ఉన్న భక్తాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి సుగంధభరిత పుష్పాలు, వడమాల, ఆకుమాల సమర్పించారు. కర్పూరహారతులిచ్చి పూజలు చేశారు. గోశాలలో గోపూజ చేశారు. భక్తులు గోమాతకు పూజలు చేసి ప్రదక్షిణలు చేశారు.

ఆవులపల్లెలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం


విశేషాలంకరణలో స్వామి,అమ్మవార్లు

సోమల : మండలంలోని ఆవులపల్లెలో టీటీడీ అనుబంధంలో ఉన్న శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం ధ్వజారోహణంతో వైభవంగా ప్రారంభమయ్యాయి. రాత్రి శ్రీదేవి, భూదేవి సమేతంగా స్వామివారు సూర్యప్రభ వాహనంపై విహరించారు. ఉదయం ఆలయంలో శ్రీస్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేక పూజలు, అలంకరణలు జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. రాత్రి ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజల అనంతరం సూర్యప్రభ వాహనంపై కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు అడుగడుగునా కర్పూర నీరాజనాలు సమర్పించారు.